సాక్షి
అనంతపురం
మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



తగ్గిన టమాట ధర

టమాట ధర మరింత తగ్గింది. కక్కలపల్లి మండీలో కిలో టమాట గరిష్ట ధర రూ.8.50, కనిష్టం రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.8°/22.5°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడాలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

17 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ 17 మండలాల పరిధిలో 8.2 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. శింగనమల 44.4 మి.మీ, ఉరవకొండ 42.6, యల్లనూరు 29.6, నార్పల 21.4, పుట్లూరు 18.4, బుక్కరాయసముద్రం 16.2, అనంతపురం 15.2, రాప్తాడు 14, పెద్దపప్పూరు 12.4, ఆత్మకూరు 10.2 మి.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. సెప్టెంబర్ సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా..ఇప్పటివరకు 80.5 మి.మీ నమోదైంది. రాగల రెండు రోజులూ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

నేడు, రేపు 'ఇంటర్ కాలేజ్ ఫెస్ట్-2023'



సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వస్తున్న విద్యార్థులు

అనంతపురం: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ అండ్ ఒకేషనల్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలోని యువ టూరిజం క్లబ్ ఈ నెల 26, 27 తేదీల్లో 'ఇంటర్ కాలేజ్ ఫెస్ట్-2023' నిర్వహించనుంది. యంగ్ మేనేజర్, ట్రెజర్ హంట్, స్పాట్ ఫొటోగ్రఫీ, క్విజ్ వంటి పోటీలలో అనంతపురం సమీపంలోని కళాశాలల విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొనవచ్చు. దేశవ్యాప్తంగా ఈ-పోస్టర్ మేకింగ్ పోటీని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో విజేతలకు 27న ఆకర్షణీయమైన ప్రైజ్ మనీ అందజేస్తారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారతదేశ రుచులను పరిచయం చేస్తూ వివిధ ఫుడ్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఏపీ టూరిజం అథారిటీ సహకారంతో మేనేజ్‌మెంట్ విభాగం సోమవారం వరల్డ్ టూరిజం డే థీమ్ 'టూరిజం అండ్ గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్స్'పై వ్యాసరచన, ప్రసంగాన్ని కూడా నిర్వహించింది. విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకులు కోరారు.

అక్టోబర్ 2 వరకు 'స్వచ్ఛతా హీ సేవ'



అనంతపురం రూరల్: భారత జల శక్తి హౌసింగ్ అర్బన్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ రెండో తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచాయతీల పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో చెత్తను తొలగించడం, గ్రామాలలో చెత్త వేసే ప్రదేశాలను శుభ్రం చేయటం, బహిరంగ ప్రదేశాలు, మార్కెట్‌లో వాల్‌పెయింట్స్ వేయడం, స్వచ్ఛతపై క్విజ్‌లు, ప్లాంటేషన్ డ్రైవ్‌లు నిర్వహించడం, స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించడం తోపాటు స్వచ్ఛత రన్ నిర్వహిస్తామన్నారు. రెండో తేదీ గాంధీ జయంతిని పురస్కరించిన అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

29 నుంచి రోలర్ స్కేటింగ్ క్రీడాకారుల ఎంపిక



అనంతపురం: త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే రోలర్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ఈ నెల 29 నుంచి చేపట్టనున్నారు. ఈ మేరకు అనంతపురం జిల్లా స్కేటింగ్ అదనపు కార్యదర్శి రవిబాబు, జిల్లా స్కేటింగ్ కోచ్ పి. నాగేంద్ర సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29న చిలమత్తూరు మండలం టేకులోడు స్టేక్ బోర్డులో ఎంపికలు ఉంటాయి. అలాగే 30వ తేదీ అనంతపురంలోని మాక్ రోలర్ స్కేటింగ్ అకాడమీలో రింక్ పోటీలు, అక్టోబర్ 1న జేఎన్‌టీయూ (అనంతపురం) క్యాంపస్ కళాశాలలో ఎంపికలు ఉంటాయి. పూర్తి వివరాలకు 94923 27908, 89783 14415లో సంప్రదించవచ్చు.

అక్రమాలకు స్మార్ట్‌గా చెక్

- డ్వాక్రా లావాదేవీలకు ఆటో డెబిట్ విధానం
- బుక్కరాయసముద్రం మండలంలో పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్
- జిల్లా అంతటా డ్వాక్రా సంఘాల్లో అమలుకు కార్యాచరణ



అనంతపురం: స్వయం సహాయక సంఘాలు/డ్వాక్రాలో అక్కచెల్లెమ్మలు చేసుకునే పొదుపు.. పొందే రుణాలు.. చెల్లించే కంతుల్లో అవకతవకలు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహిస్తోంది. 'స్మార్ట్' ఆర్థిక లావాదేవీలతో పారదర్శకతకు పెద్ద పీట వేస్తోంది. ఈ విధానం వల్ల సమయం ఆదా అవడంతో పాటు ఆర్థిక లావాదేవీలు పక్కాగా ఉంటాయి. డ్వాక్రా సభ్యులు కూడా డిజిటల్ పేమెంట్స్‌ను సాదరంగా ఆహ్వానిస్తున్నారు.

పారదర్శకంతో జవాబుదారీతనం

స్త్రీ నిధి ద్వారా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీల) సభ్యులకు జీవనోపాధి రుణాలు మంజూరు చేస్తున్నారు. జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను స్త్రీనిధి రుణాలు రూ.147 కోట్లు మంజూరు చేయాలని లక్ష్యం నిర్దేశించారు. ఇందులో ఇప్పటి వరకు రూ.74 కోట్ల రుణాలు మంజూరయ్యాయి. ఈ రుణాల పంపిణీలో అవకతవకలు లేకుండా, సొమ్ము రికవరీ పకడ్బందీగా జరిగేలా 'ఆటో డెబిట్' విధానాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. స్త్రీనిధి రుణాలు పొందిన సభ్యులు నెలవారీ కంతు (ఈఎంఐ) పద్ధతిలో ఆటో డెబిట్ విధానంలో చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి నెలా నిర్దేశించిన రోజులోపే పొదుపు ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా జమ చేసిన మొత్తం ఆటో డెబిట్ విధానంలో నేరుగా పొదుపు సంఘం ఖాతా నుంచి స్త్రీ నిధి ఖాతాకు జమ కానుంది. ఈ తరహాలోనే సభ్యులకు రుణాలు జమ చేస్తారు. ఈ విధానంలో పారదర్శకతతో పాటు సభ్యుల చెల్లింపుల వివరాలు పూర్తిగా సంఘం స్థాయిలోనే సభ్యులందరికీ తెలియజేస్తారు. జవాబుదారీతనం పెంపొందుతుంది. నిర్దేశిత తేదీ నాటికి కచ్చితంగా కంతు చెల్లించడం వల్ల సభ్యులకు వడ్డీభారం తగ్గుతుంది.

- ఇప్పటి వరకు ఆటోమేటిక్ డెబిట్ విధానం వల్ల రుణాల మంజూరులో 1800కు పైగా సంఘాలకు సంబంధించి రూ.36 కోట్ల వరకు లావాదేవీలు జరిగాయి.

వీఓఏలకు శిక్షణ పూర్తి

- డ్వాక్రా సంఘాల్లో డిజిటల్ చెల్లింపులు ప్రోత్సహించేందుకు జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద బుక్కరాయసముద్రం మండలాన్ని ఎంపిక చేశారు. ఈ మండలంలోని వీఓఏలకు డీఆర్‌డీఏ అధికారులు పేటీఎం స్కానర్లను అందజేశారు. ఈ మేరకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. గ్రామైక్య సంఘాలు తమ పరిధిలోని గ్రామ సంఘాల్లోని మహిళలకు అవగాహన కల్పిస్తారు. నేరుగా మహిళలు వారి ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ల నుంచి చెల్లింపులు చేసుకోవచ్చు. ఈ విధానంతో డిజిటల్ చెల్లింపులు పెరగడమే కాకుండా పొదుపు గ్రూపు సభ్యులు మోసపోవడానికి ఏమాత్రమూ ఆస్కారం ఉండదు.

ఆర్థిక అక్షరాస్యత పెంపొందాలి



"పొదుపు సంఘాల్లో సింహభాగం ఆర్థిక అక్షరాస్యత ఉన్న వారే. తక్కిన వారి కుటుంబాల్లో చదువుకున్న వారు ఉన్నారు. పేటీఎం ద్వారా డిజిటల్ చెల్లింపులు చేస్తే అక్రమాలకు ఆస్కారం ఏర్పడకుండా ఉంటుంది. ప్రయోగాత్మకంగా బుక్కరాయసముద్రం మండలంలో ప్రారంభమైంది. సత్ఫలితాలు రావడంతో జిల్లాలోని 1,800 సంఘాల్లో ఈ విధానం అమలు చేశాం.

– ఐ.నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

అటవీ భూమి అన్యాక్రాంతంపై కలెక్టర్ సీరియస్

- నివేదిక సమర్పించాలని ఆర్డీఓకు ఆదేశం

సాక్షి స్పందన

కణేకల్లు: కళేకుర్తి గ్రామ శివారులో వేదవతి హగరి పరీవాహక ప్రాంతంలో ఎడారి నివారణ కోసం పెంచిన చెట్లను నరికేసి భూమి కబ్జాకు యత్నించిన ఘటనను కలెక్టర్ గౌతమి సీరియస్‌గా తీసుకొన్నారు. వేదవతి హగిరి ఒడ్డున పచ్చని చెట్లను ఓ టీడీపీ కార్యకర్త నరికేసి సాగు భూమిగా మార్చుతున్న వైనాన్ని 'సాక్షి' దినపత్రిక సోమవారం 'అటవీ భూమి అన్యాక్రాంతం' శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఈ వార్తకు కలెక్టర్ స్పందించారు. ఎన్ని చెట్లు నరికేశారు? ఎంత విస్తీర్ణంలో కబ్జా చేస్తున్నారో? పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కళ్యాణదుర్గం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డితోపాటు తహసీల్దార్ రజాక్ వలీని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు ఘటన స్థలాన్ని సందర్శించి చెట్ల నరికేతపై ఆరా తీశారు. గ్రామంలో విచారించారు. రాయదుర్గం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లక్ష్మప్ప, బీట్ ఆఫీసర్ స్వర్ణలత కూడా ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ లక్ష్మప్ప 'సాక్షి'తో మాట్లాడారు. అటవీ భూమి కబ్జా చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా భూమిలో దిగి భూమి దున్నడం, చదను చేయడం లాంటివి చేస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రత్యేక శ్రద్ధతో అర్జీలు పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తూ సమస్యలు వింటున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో ప్రజల నుంచి అందే అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ గాయత్రీ దేవి, ఆర్డీఓ మధుసూదన్, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు 417 అర్జీలు స్వీకరించారు. అనంతరం 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యను తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా పరిష్కరిస్తే అర్జీలు రీ-ఓపెన్ కావన్నారు. సమస్య పరిష్కరించిన తరువాత అదే విషయంపై అర్జీదారునికి తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

అర్జీల్లో కొన్ని...

- తన భూమిని వేరొకరి పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేశారని పామిడి మండలం ఖాదర్‌పేటకు చెందిన సి.ఓబులేసు ఫిర్యాదు చేశాడు. సర్వే నంబరు 162–2లో తనకు 4.68 ఎకరాలు భూమి (ఖాతా నంబరు 457) ఉందని చెప్పాడు. వర్షాధారం కింద పంట సాగు చేసుకుంటున్నానని చెప్పాడు. అయితే ఈ భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్‌లో మార్పు చేశారని, దీనిపై విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరాడు.
- తమ పొలాన్ని ఇద్దరు వ్యక్తులు వారి పేరున ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని యాడికి మండలం నిట్టూరుకు చెందిన జింకల చిన్న నారాయణ ఫిర్యాదు చేశాడు. కమలపాడు గ్రామ పొలం సర్వే నంబరు 10–1లో తమకు 6.78 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమిని 1988లో కొనుగోలు చేసి అగ్రిమెంట్ చేయించుకున్నామని చెప్పాడు. అయితే 2.17 ఎకరాల చొప్పున ఇద్దరు వ్యక్తులు 4.34 ఎకరాలను వారి పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవడంతో పాటు పాసుపుస్తకాలు పొందారని చెప్పాడు. దీనిపై విచారణ చేయించి తనకు న్యాయం న్యాయం చేయాలని కోరాడు.

నిరుద్యోగులకు టోకరా

- బీటెక్ విద్యార్థులే టార్గెట్
- రూ.5 కోట్లు దోపిడీ
- ఆంధ్రా, తెలంగాణలో 150 మందికి పైగా బాధితులు
- మోసగాళ్ల వెనుక టీడీపీ నేతలు



అనంతపురం క్రైం: ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ పేరిట నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన ఉదంతం అనంతపురంలో వెలుగు చూసింది. బాధితులు సోమవారం అనంతపురం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను 'స్పందన'లో కలసి జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాప్తాడుకు చెందిన టీడీపీ నేత కసునన్నల్లో అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శశి, ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గుర్రం వెంకటరామ్, భానుచంద్రతో పాటు మరికొంత మంది ఘరానా కేటుగాళ్లు.. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాల పేరిట బీటెక్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు వల వేశారు. ప్రధానంగా కంప్యూటర్ శిక్షణ కేంద్రాల వద్ద పాగా వేసిన వీరు అనతి కాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 150 మందికి పైగా నిరుద్యోగులను ముగ్గులోకి దింపారు. శాలరీ ప్యాకేజీని బట్టి ధర ఉంటుందంటూ ఒక్కొక్కరి వద్ద రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల దాకా వసూలు చేశారు. ఇలా రూ. 5 కోట్లకు పైగా దండుకున్నారు. డబ్బిచ్చిన వారికి ఆరు నెలల శిక్షణ కూడా ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో రూ.10 వేల నుంచి రూ.18 వేల దాకా గౌరవ వేతనం కూడా చెల్లిస్తామని నమ్మబలికారు.

నకిలీ కంపెనీ పెట్టి...

బెంగళూరులోని ఎలక్ట్రానిక్ సిటీలో 'సార్టీస్ టెక్నాలజీ లిమిటెడ్' పేరుతో నకిలీ కంపెనీ ఏర్పాటు చేశారు. నిజమని నమ్మి డబ్బు కట్టిన వారు అదే ప్రాంతంలో అద్దెకు గదులు తీసుకుని ఆరు నెలల పాటు వారు చెప్పిన పని చేసుకుంటూ వచ్చారు. అయితే.. వారికి కంపెనీ పనులు పూర్తి కాలేదంటూ గౌరవ వేతనం కూడా చెల్లించలేదు. చేసేది లేక చాలా మంది నిరుద్యోగులు 'ఎలాగూ ఇన్ని నెలలు ఉన్నాం కదా?! మిగిలిన కాలం పూర్తి చేస్తే ఉద్యోగం దొరుకుతుంద'న్న ఆశతో అప్పులు చేసి మరీ కాలం గడిపారు. తీరా నిర్వాహకులు రాత్రికి రాత్రే కంపెనీకి తాళాలు వేసి అనంతపురానికి చేరుకున్నారు. బాధితులు బెంగళూరు నుంచి ఇళ్లకు రాలేక, అయిన వారికి ముఖం చూపించలేక నరకయాతన అనుభవించారు.

నాన్న ఆరోగ్యం బాగోలేదన్నా కనికరించలేదు

పుట్టపర్తికి చెందిన ఓ యువకుడు తండ్రికి తెలియకుండా లక్షలాది రూపాయలు అప్పుగా తెచ్చి వారికి చెల్లించాడు. ప్రస్తుతం తండ్రి ఆరోగ్యం బాగా క్షీణించి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంది. దీంతో అతను అనంతపురం వచ్చి వారిని కాళ్లా వేళ్లా పడినా డబ్బివ్వలేదు. పైగా మరోసారి వస్తే నీపైనే ఎదురు కేసు పెట్టి లోపలేయిస్తామని బెదిరించారు.

డబ్బడిగితే బెదిరిస్తున్నారు!



నిరుద్యోగులను వంచించిన వారు అనంతపురంలో జల్సాలు చేసుకుంటూ తిరుగుతున్నారు. వారిని బాధితులు కలసి తమ డబ్బు తిరిగివ్వాలని కోరితే... బెదిరింపులకు దిగుతున్నారు. 'మా వెనుక రాప్తాడుకు చెందిన టీడీపీ నేతలు ఉన్నారు. ఖబడ్దార్' అంటూ దాడులకు సైతం తెగబడుతున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా పరిషత్‌లోని చిత్రావతి అతిథి గృహం వద్దకు బాధితులను పిలిపించుకుని టీడీపీ నేతలు బెదిరింపులకు దిగారు. 'అన్నీ మూసుకుని వెళతారా? లేక తన్నులు తింటారా' అంటూ బెదిరించారు. డబ్బు తిరిగివ్వకపోగా బెదిరింపులు ఎక్కువ కావడంతో కొంత మంది బాధితులు సోమవారం జిల్లా ఎస్పీని కలసి ఫిర్యాదు చేశారు.

పెద్దాస్పత్రిలో గద్దలు



- అలా రాగానే.. ఇలా పంపించేస్తారు
- సర్వజనాస్పత్రి పేషెంట్లను బెంబేలెత్తిస్తున్న మాఫియా
- 'ఆరోగ్యశ్రీ' కింద మెరుగైన వైద్యమంటూ 'ప్రైవేట్'కు తరలింపు
- కేసు రాగానే ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి సిఫార్సుదారులకు 'ఫోన్ పే'
- మాఫియాలో ఆస్పత్రి సిబ్బంది, డాక్టర్లు, కొందరు మీడియా ప్రతినిధులు

- నెల క్రితం రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఒకరు తీవ్రంగా గాయపడి సర్వజనాస్పత్రికి వచ్చారు. ఇక్కడ సరిగా వైద్యం అందదని, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లండని ఎమర్జెన్సీ వార్డు దగ్గరే కొందరు చెప్పి వెనక్కు పంపించారు. బాధితుడు ప్రైవేటు ఆస్పత్రిలో నాలుగు రోజులుండి అక్కడ కోలుకోలేక తిరిగి సర్వజనాస్పత్రికి వచ్చి చేరాడు. ఇక్కడే వైద్యం పొంది డిశ్చార్జి అయ్యారు.
- వారం క్రితం ఉరవకొండకు చెందిన ఓ యువకుడు ద్విచక్రవాహనంపై వెళుతూ కిందపడి తీవ్రగాయాలతో అనంతపురం సర్వజనాస్పత్రికి వచ్చారు. మల్టిపుల్ ఫ్రాక్చర్ అయ్యింది. ఈ సర్జరీలు అక్కడ బాగా చేస్తారని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించినప్పటికీ అతని నుంచి అదనంగా డబ్బు వసూలు చేశారు.

ఈ ఏడాది సెప్టెంబర్ 4 వరకు నమోదైన ఆరోగ్యశ్రీ కేసులు	
మొత్తం ఆరోగ్యశ్రీ కేసులు	31,802
ప్రైవేటుకు వెళ్లిన కేసులు	21,505
సర్వజనాసుపత్రికి వచ్చినవి	8,760



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లాలోని పేదలందరికీ అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రే పెద్ద దిక్కు. ఇక్కడ అన్నిరకాల స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయి. వివిధ జబ్బులు, దీర్ఘకాలిక రోగాలు, అత్యవసర సేవలకు ఉచితంగా ఖరీదైన, నాణ్యమైన వైద్యం అందిస్తారు. అయితే గత కొన్ని నెలలుగా సర్వజనాస్పత్రికి వస్తున్న రోగులను ప్రైవేట్ ఆస్పత్రులు గద్దల్లా తన్నుకుపోతున్నాయి. ఇందుకు సర్వజనాస్పత్రికి చెందిన కొందరు ఎంఎన్‌ఓలు, డాక్టర్లు, మీడియా ప్రతినిధుల సహకారం తీసుకుంటున్నాయి. వీరంతా పేషెంటు రాగానే 'ఇక్కడ వైద్య సేవలు బాగలేవు' అని భయపెట్టి ప్రైవేట్ ఆస్పత్రులకు పంపడం నిత్యకృత్యమైంది. ఇలా పంపిన కేసులు ఆరోగ్యశ్రీ కింద అడ్మిషన్ అవగానే సదరు సిఫార్సుదారులకు ప్రైవేటు ఆస్పత్రుల నుంచి ఫోన్ పే ద్వారా 'నజరానాలు' అందుతున్నట్లు 'సాక్షి' పరిశీలనలో వెల్లడైంది.

ఆరంభంలోనే భయపెట్టేస్తారు

సాధారణంగా ప్రమాద కేసులన్నీ 108 వాహనంలో ఆస్పత్రికి వస్తాయి. పేషెంటును కిందకు దించగానే ఎంఎన్‌ఓలు, కొంతమంది మీడియా ప్రతినిధులు, ఒకరిద్దరు డాక్టర్లు వెంటనే పేషెంటు బంధువులను భయపెడతారు. ఇక్కడ బెడ్‌లు లేవనో, డాక్టర్లు లేరనో చెబుతారు. ఆ మరుక్షణమే బయటే కాచుకుని ఉన్న ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లు లోపలకు వస్తారు. పేషెంటును వెంటనే ఎక్కించుకుని 'సిబ్బంది' చెప్పిన ప్రైవేటు ఆస్పత్రికి చేరుస్తారు. అక్కడ ఆరోగ్యశ్రీ కింద చేర్చినా అప్రువల్ వచ్చే వరకూ టెస్టులు, ఎక్స్‌రేలు, స్కానింగులు అంటూ రూ.10 వేలు తక్కువ కాకుండా వసూలు చేస్తారు.

కాసుల కోసం కక్కుర్తి

శవాలమీద పేలాలు ఏరుకోవడం అంటే ఇదే. ప్రమాదాలు లేదా అత్యవసర చికిత్సలో భాగంగా వచ్చే పేద రోగులను ఇక్కడ కొంతమంది దోచుకుతింటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న కొంతమంది మీడియా ప్రతినిధులపై గతంలో ఒక వైద్యుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

అధికారులకు తెలిసినా...

ఆస్పత్రి ఉన్నతాధికారులకు ఈ తతంగం తెలిసినా పట్టించుకునే పరిస్థితి లేదు. స్వయానా సూపరింటెండెంట్‌కు ఈ వ్యవహారం తెలిసినా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ఒకదశలో ఆర్‌ఎంఓలు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. దీంతో సామాన్యులు సూపరింటెండెంట్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భారీగా తగ్గిన ఆరోగ్యశ్రీ కేసులు

ఆరోగ్యశ్రీ కేసులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో భారీగా పెరగాలని ప్రభుత్వం ఆదేశించినా ఇక్కడ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఆరోగ్యశ్రీ కేసులు సర్వజనాస్పత్రికి పూర్తిగా తగ్గిపోతున్నాయి. జిల్లాలో ఆరోగ్యశ్రీ కేసులు 67.62 శాతం ప్రైవేటుకు వెళుతున్నాయి. సర్వజనాస్పత్రికి 27 శాతం కేసులు మాత్రమే వస్తున్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం



సర్వజనాపత్రికి వచ్చిన కేసులను ప్రైవేటు ఆస్పత్రులకు పంపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెడతాం. దీనిపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ఉంటుంది. దీనివెనుక ఎవరున్నా చర్యలు తప్పవు.

– గౌతమి, కలెక్టర్

అసౌకర్యం కల్గిస్తే వదిలేదే లేదు



ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు అసౌకర్యం కల్గించి ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తే వదిలేది లేదు. ఇలాంటి వాటిపై నాకు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. నా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు ఇస్తే మిగతావన్నీ నేను చూస్తా. రోగుల తరలింపు వెనుక ఎంత పెద్ద వారున్నా వదిలే ప్రసక్తే లేదు. 94407 96800కు ఫోన్ చేస్తే చాలు.

– అన్బురాజన్, ఎస్పీ

'జగనన్న ఆరోగ్య సురక్ష' పకడ్బందీగా నిర్వహించాలి

అనంతపురం అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వివిధ అంశాలపై సోమవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇప్పటికే ఇంటింటి క్యాంపెయిన్ చేపట్టారన్నారు. ఇంటింటి క్యాంపెయిన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ తక్కువగా జరిగిందన్నారు. లోటుపాట్లు లేకుండా క్యాంపులు సక్రమంగా నిర్వహించేందుకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ నెల 27న వలంటీర్లు రెండో దఫా ఇంటింటి క్యాంపెయిన్ చేపట్టాలన్నారు.

నేడు పైలట్ ప్రాజెక్టు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం–1 విలేజ్ హెల్త్ క్లినిక్‌లో పైలట్ ప్రాజెక్టు కింద లాంఛనంగా ప్రారంభిస్తున్నామని కలెక్టర్ చెప్పారు.

పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అక్టోబరు 2 వరకు 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. పట్టణాల్లో ప్రధాన ప్రాంతాల్లో చెత్తను తొలగించడం, గ్రామాల్లో వ్యర్థాలు వేసే ప్రాంతాల్లో శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. అక్టోబరు 1న ప్రజలతో 'ఏక్ దిన్.. ఏక్ గంట' కింద శ్రమదానం చేయించాలన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తవ్వాలి

'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు డిసెంబరు 31 నాటికి వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి తీసుకురావాలన్నారు.

క్లుప్తంగా

పెన్నహోబిలంలో హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం హుండీ కానుకలను లెక్కించారు. ఆలయ ఈఓ విజయ్‌కుమార్, దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.రాణి పర్యవేక్షించారు. ఆలయంలోని ఆరు హుండీలను లెక్కించగా 119 రోజులకు గాను రూ.30,14,991 ఆదాయం చేకూరింది.

ఆర్మీ సెలక్షన్స్‌లో ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విజయఢంకా



ఆర్మీ సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులతో అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి

తిరుపతి రూరల్: గుంటూరులో ఈ నెల 24న నిర్వహించిన ఆర్మీ సెలక్షన్స్‌లో తిరుపతిలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు వివిధ విభాగాల్లో విజయదుందుభి మోగించారు. ఈ మేరకు ఆ అకాడమీ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సోమవారం తిరుపతిలోని అకాడమీలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషారెడ్డి మాట్లాడుతూ ఆర్మీ సెలక్షన్స్‌లో అకాడమీకి చెందిన 85 మంది విద్యార్థులు వివిధ విభాగాలకు ఎంపికవడంపై హర్షం వ్యక్తం చేశారు. టెక్నికల్ విభాగంలో 17 మంది, జీడీ–66, ట్రేడ్స్‌మెన్–2 ఇలా మొత్తం 85 మంది సెలక్ట్ అయ్యారన్నారు. అకాడమీలో విద్యతో పాటు డిఫెన్స్‌లో ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శారీరక, మానసిక, సాంకేతిక, వ్యక్తిత్వ వికాసం అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు అకాడమీలో ఉచిత విద్యను అందిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

93929 26803కి కాల్ చేస్తే స్పందిస్తా

- ఎస్పీ అన్బురాజన్
- 'పోలీసు స్పందన'కు 179 వినతులు

అనంతపురం క్రైం: సమస్య ఏదైనా నేరుగా తనకు (93929 26803) కాల్ చేస్తే వెంటనే స్పందిస్తానంటూ జిల్లా ప్రజలకు ఎస్పీ కేకేఎస్ అన్బురాజన్ భరోసానిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై ఏకంగా 179 వినతులు అందాయి. ఈ సందర్భంగా అర్జీదారులతో కార్యాలయం కిటకిటలాడింది. వినతులను ఎస్పీ స్వయంగా స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను అర్జీదారుల ఎదుటనే వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్పందన విభాగంలో ప్రజల కోసం ప్రత్యేకంగా 93929 26803 ఫోన్ నంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. స్పందన కార్యక్రమానికి నేరుగా హాజరు కాలేని వారు ఈ నంబర్‌కు కాల్ చేసి సమస్య వివరిస్తే తక్షణమే స్పందిస్తామన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (www.cybercrime.gov.in) కు లాగిన్ అయి నేరుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఆన్‌లైన్‌పై అవగాహన లేని వారు 1930కు ఫోన్



స్పందన కార్యక్రమంలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

కోడలిపై కన్నేసిన మామ

అనంతపురం క్రైం: మెట్టినింట లైంగిక వేధింపులకు పాల్పడుతున్న మామపై ఓ వివాహిత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన'లో ఎస్పీ అన్బురాజన్‌ను కలసి తన గోడు వెళ్లబోసుకుంది. బాధితురాలు తెలిపిన మేరకు... నగరంలోని కోవూరుకు చెందిన ఓ యువతికి రుద్రంపేట శివారులోని గోవర్ధననగర్‌కు చెందిన నీలకంఠ రాయుడుతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. భర్త రుద్రంపేటలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇటీవల కోడలిపై మామ ఓబులేసు కన్నేశాడు. కుమారుడు చికెన్ సెంటర్‌కు వెళ్లిపోగానే ఓబులేసు తన కోడలితో అసభ్యంగా ప్రవర్తించసాగాడు. కామవాంఛతో శాడిస్టుగా మారిపోయాడు. విషయాన్ని భర్త, అత్తకు చెబితే వారు విశ్వసించలేదు. చివరకు వేధింపులు భరించలేక ఇటీవల తన పుట్టింటి వారితో విషయం మొరబెట్టుకోవడంతో నెల రోజుల క్రితం పంచాయితీ పెట్టారు. గొడవలు లేకుండా విడిపోదామని పెద్దల ఎదుట చెప్పిన భర్త ఆ తర్వాత ముఖం చాటేయడంతో బాధితురాలు 'దిశ' పోలీసు స్టేషన్ ఆశ్రయించింది. దీంతో వేరు కాపురం పెట్టుకుంటానని పోలీసుల ఎదుట అంగీకరించిన భర్త మళ్లీ ఆ ఊసే ఎత్తకపోవడవంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు ఎస్పీ అన్బురాజన్‌కు ఫిర్యాదు చేసింది.

హ్యాండ్ బాల్, హాకీ జట్ల ఎంపిక

అనంతపురం: ఈ నెల 29 నుంచి గుంటూరులోని తెనాలిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ సోమవారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సుగుణమ్మ తెలిపారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అలాగే అండర్–14, అండర్–17 హాకీ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ కూడా పూర్తి చేశారు.

రెజ్లింగ్‌లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

విజయవాడ వేదికగా ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకూ జరిగిన స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ విభాగంలో జిల్లా క్రీడాకారులు పతకాలు దక్కించుకున్నారు. అండర్–14, అండర్–17 విభాగంలో మొత్తం 17 పతకాలను బాలబాలికలు సాధించారు. ఇందులో మూడు బంగారు, ఏడు వెండి, మరో ఏడు రజత పతకాలు ఉన్నాయి. ప్రతిభ చాటిన క్రీడాకారులను అనంతపురం డీఈఓ నాగరాజు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ అభినందించారు.

ఏపీజీబీ ద్వారా రూ.6.19 కోట్ల రుణాలు

- బ్యాంక్‌చైర్మన్ రాకేష్‌కశ్యప్

అనంతపురం అగ్రికల్చర్: వందశాతం ప్రభుత్వ రంగ బ్యాంకుగా అన్ని వర్గాల అభ్యున్నతికి, అన్ని రంగాల పురోగతికి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ అన్నారు. అనంతపురంలోని సాయి కళాశాల ఆవరణలో సోమవారం అనంతపురం రీజియన్ పరిధిలోని కస్టమర్ అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... అనంతపురం రీజియన్ పరిధిలో 65 శాఖలతో రూ.5,804 కోట్ల వ్యాపార లావాదేవీలతో తమ బ్యాంక్ అగ్రస్థానంలో ఉందన్నారు. రైతులు, మహిళలు, గృహ, వాహన, విద్య తదితర అన్ని రకాల రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 120 మంది లబ్ధిదారులకు రూ.6.19 కోట్ల విలువ చేసే ట్రాక్టర్లు, ఆటోలు, రుణ మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీదేవి, ఎల్‌డీఎం సత్యరాజ్, సీనియర్ మేనేజర్ చైతన్య పాల్గొన్నారు.

• సేవకు సత్కారం

రాప్తాడు రూరల్: పంచాయతీ పరిసరాల పరిశుభ్రత కోసం పాటుపడిన క్లాప్ మిత్రాలను స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాజశేఖర్ ఘనంగా సన్మానించారు. సోమవారం విజయవాడలోని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి పంచాయతీ క్లాప్ మిత్ర నాగజ్యోతి, మండల కేంద్రం కుందుర్పికి చెందిన క్లాప్ మిత్ర హనుమంతు... రాజశేఖర్ చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు.



క్లాప్ మిత్ర నాగజ్యోతిని సన్మానిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రాజశేఖర్

పాడి పోషణ లాభదాయకం

- పశు సంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: ఆధునిక మెలకువలు పాటిస్తే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుందని రైతులకు పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. పాడి పోషణపై రెడ్డిపల్లి ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ పశుగణన మిషన్ ద్వారా అభ్యుదయ పాడి రైతులకు క్షేత్ర సందర్శన కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రకాష్ డెయిరీ సందర్శన నిమిత్తం ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 40 మంది రైతులను పిలుచుకెళ్లారు. సోమవారం పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ ఆవరణలో రైతులు వెళ్లే బస్సును జేడీ సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించి, మాట్లాడారు. వ్యవసాయం తర్వాత అత్యధికంగా రైతులు పాడి పోషణపై ఆధారపడ్డారన్నారు. అయితే సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతో కొంత నష్టాలను చవి చూడాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పాడి పోషణపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర సందర్శనకు రైతులను తీసుకెళుతున్నట్లు వివరించారు. పాడిపరిశ్రమలో రాణించాలనే రైతులకు ఇది సువర్ణ అవకాశమన్నారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణాకేంద్రం ఏడీ రామచంద్రారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రమేష్‌రెడ్డి, వెంకటేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు రత్నకుమార్, శ్రీకాంత్, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



పాడిరైతుల క్షేత్ర సందర్శన బస్సు యాత్రను ప్రారంభిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

మహబూబ్‌బాషాకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు



అవార్డుకు ఎంపికైన ఫొటో (ఇన్‌సెట్‌లో) డి.మహబూబ్‌బాషా

అనంతపురం కల్చరల్: సాక్షి దినపత్రిక ఫొటోగ్రాఫర్ డి.మహబూబ్‌బాషాకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు దక్కింది. ఈ మేరకు ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (పీఏఐ) ఫౌండర్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల రాష్ట్ర పర్యాటక శాఖ సౌజన్యంతో పీఏఐ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సూర్యోదయం సమయంలో భానుడి లేలేత కిరణాలు తాకి శోభాయమానంగా వెలుగులీనుతున్న ఇస్కాన్ మందిరాన్ని తన కెమెరాలో మహబూబ్‌బాషా బంధించిన తీరు ప్రకృతి రమణీయతకు అద్దం పట్టింది. ఈ చిత్రమే ఆయనను పోటీల్లో విజేతగా నిలబెట్టింది. ఈ నెల 27న విజయవాడ వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పర్యాటక దినోత్సవంలో మంత్రులు, అధికారుల చేతుల మీదుగా ఆయన అవార్డుతో పాటు బంగారు పతకాన్ని అందుకోనున్నారు. ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా ఎంపికైన మహబూబ్ బాషాను జిల్లా ఫొటో జర్నలిస్టు యూనియన్ నాయకులు అభినందించారు.

వివాహిత అనుమానాస్పద మృతి



భవానీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఫణికుమార్, ఎస్‌ఐ యువరాజ్

శెట్టూరు: నాటు వైద్యం కోసం వచ్చిన ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కలగళ్ల గ్రామానికి చెందిన నల్లబోతుల భవాని(26), తన భర్త రాముతో కలసి సంతానం కోసం ఆకు పసురు తీసుకునేందుకు సోమవారం శెట్టూరు పరిసర ప్రాంతమైన కర్ణాటక తిప్పారెడ్డిపల్లికి వచ్చారు. అయితే ఆకు పసురు ఇవ్వకపోవడంతో వెనుతిరిగి శెట్టూరుకు చేరుకుని ఓ హోటల్‌లో భోజనం చేశారు. కాసేపటి తర్వాత భవాని తనకు ఛాతిలో నొప్పిగా ఉందని అనడంతో 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి రాము తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. అయితే భవాని మృతిపై తండ్రి గుజ్జల వెంకటేశులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెద్దవడుగూరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరుకు చెందిన కృష్ణారెడ్డి (64)కి భార్య పద్మావతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గ్రామ శివారులోని తన పొలంలో సాగు చేసిన కొర్ర పంటను పరిశీలిస్తూ వెళుతుండగా అప్పటికే తెగిపడిన 11కేవీ విద్యుత్ లైన్‌ను గమనించకుండా కాలు పెట్టడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతసేపటికీ కృష్ణారెడ్డి ఇంటికి చేరుకోకపోవడంతో సాయంత్రం భార్య పద్మావతి పొలానికి వెళ్లి చూసింది. అప్పటికే విగతజీవిగా కొర్ర పంటలో పడి ఉన్న భర్తను గమనించి బోరున విలపిస్తూ చుట్టుపక్కల రైతులను అప్రమత్తం చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడు చేరుకుని పరిశీలించి, బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి శిల్పారామంలో పర్యాటక వేడుకలు

అనంతపురం కల్చరల్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నుంచి రెండ్రోజుల పాటు అనంతపురం నగర శివారులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు వేడుకలను ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ గౌతమి ప్రారంభించనున్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులను అందజేయనున్నారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు అనంతపురం ఆర్ట్స్ కళాశాల వద్ద పర్యాటక ప్రాధాన్యతను తెలియజేసేలా బైక్ ర్యాలీ ఉంటుంది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించే ఈ ర్యాలీ రామనగర్, 80 ఫీట్ రోడ్, సంగమేష్ నగర్ మీదుగా కలెక్టరేట్ చేరుకుంటుంది. మధ్యాహ్నం పుట్టపర్తి జిల్లాలో పర్యాటక ర్యాలీలు, సాంస్కృతిక సంబరాలు జరుగుతాయి. ఈ మేరకు జిల్లా పర్యాటక శాఖ అధికారి జి.నాగేశ్వరరెడ్డి తెలిపారు.

తొలి రోజు మిశ్రమ స్పందన



అనంతపురం సిటీ: హైదరాబాద్–బెంగళూరు మధ్య నూతనంగా ప్రవేశపెట్టిన వందేభారత్ రైలుకు తొలి రోజు మిశ్రమ స్పందన లభించింది. బెంగళూరులోని యశ్వంత్‌పూర్ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం మధ్యాహ్నం 2.45 గంటలకు కాచిగూడకు బయలుదేరిన రైలు సాయంత్రం 5.40 గంటలకు అనంతపురానికి చేరుకుని 5.41 గంటలకు బయలుదేరింది. మొత్తం ఎనిమిది కోచ్‌ల్లో 522 మంది కూర్చొని వెళ్లే సామర్థ్యమున్న ఈ రైలులో 194 మంది టిక్కెట్లు బుక్ చేసుకున్నట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి. ఇందులో కామన్ కోచ్‌లో 133 మంది, ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 34 మంది ప్రయాణించారు. యశ్వంత్‌పూర్ నుంచి అనంతపురానికి 18 మంది ఉండగా, అనంతపురం నుంచి కాచిగూడకు 16 మంది టిక్కెట్లు బుక్ చేసుకున్నట్లు సమాచారం. రైలులో ప్రయాణించిన వారిలో 110 మంది భోజనాలు ఆర్డర్ ఇచ్చారు. అయితే ఆన్‌లైన్‌లో ఈ రైలుకు సంబంధించిన సమాచారం అప్‌డేట్ కాకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేటి నుంచి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా మంగళవారం నుంచి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ సబ్ జూనియర్ బాలుర చాంపియన్ షిప్ – 2023 పోటీలు ప్రారంభం కానున్నాయి. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మొత్తం 20 జట్లు తలపడనున్న ఈ పోటీలు అక్టోబర్ 10న ముగుస్తాయి.

బీకేఎస్ చెరువు ఆధునికీకరణకు చర్యలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చిక్కవడియార్ చెరువు ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద సోమవారం చిక్కవడియార్ చెరువులో కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టారు. పనులను ఎంపీపీ సునీతతో కలసి వేణుగోపాలరెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని చెరువు కట్టల ఆధునికీకరణ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

29న జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ టెన్నిస్ పోటీలు

అనంతపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న జిల్లా స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అండర్–17, అండర్–14 విభాగంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల బాలబాలికలకు అనంతపురం నగరంలోని నారాయణ టెన్నిస్ అకాడమీలో పోటీలు ఉంటాయి. సంబంధిత పాఠశాలల పీఈటీ, పీడీలు ఆసక్తి ఉన్న క్రీడాకారులతో ఆన్‌లైన్ ద్వారా ముందుగా ఎంట్రీ చేసుకోవాలి. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం అందజేస్తారు.

పండమేరులో పడి యువతి మృతి



సాకే చంద్రకళ

రాప్తాడు: ప్రమాదవశాత్తు పండమేరులో పడి ఓ యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడుకు చెందిన చిన్న ఓబన్న కుమార్తె సాకే చంద్రకళ (33) తల్లిదండ్రులు మృతిచెందడంతో సోదరులు గౌరిశంకర్, శ్రీనివాసులు వద్ద ఉంటోంది. కంటి చూపు సరిగా లేని ఆమె సోమవారం ఉదయం జీఎస్‌టీయూ మార్గంలోని పండమేరు వంకలోకి బహిర్భూమి కోసం వెళ్లింది. ఆ సమయంలో అదుపు తప్పి వంకలో పడడంతో నీట మునిగి ఊపిరి ఆడక మృతి చెందింది. 11 గంటల ప్రాంతంలో అటుగా వెళ్లిన వారు గుర్తించి, సమాచారం అందించడంతో ఎస్‌ఐ ఆంజనేయులు అక్కడకెళ్లి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతురాలిని చంద్రకళగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారొచ్చి ధ్రువీకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం: కర్ణాటక నుంచి అక్రమంగా అనంతపురానికి తరలిస్తున్న 192 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని అనంతపురం సెబ్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అందిన ముందస్తు సమాచారంతో ఏఎస్పీ రామకృష్ణ ఆదేశాల మేరకు కూడేరు మండలం ఇప్పేరు వద్ద సెబ్ సీఐ రవిచంద్ర, ఇంటెలిజెన్స్ సీఐ నరసానాయుడు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా మద్యం టెట్రాప్యాకెట్లు తరలిస్తూ సిరిగొని రాముడు పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయండి



ప్రత్యామ్నాయ విత్తనాలపై ఏఓతో మాట్లాడుతున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: ప్రభుత్వం నుంచి సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలను అందించాలని ఎంపీపీ సుబ్బర హేమలత సోమవారం ఏఓ సుచరితను కోరారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏఓ తో రైతుల సమస్యలపై మాట్లాడారు. ఉలవలు ,పెసలు, అలసందులు, రాగులు, జొన్నలు అందిస్తారని కాని మండలంలో ఉలవలు మాత్రమే ఇస్తున్నారన్నారు. పెసలు, అలసందులు కూడా తెప్పించి రైతులకు సబ్సిడీపై అందించాలన్నారు. పంపనూరు గ్రామంలో సర్పంచ్ ఎర్రిస్వామి ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై ఉలవలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు ఓబీ టైలర్ వెంకటేష్, శ్రీరామ్ పాల్గొన్నారు.

విద్యాశాఖ కమిషనర్‌ను కలిసిన ఓబుళపతి



కమిషనర్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఓబుళపతి

రాప్తాడురూరల్: విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ ఎస్.సురేష్‌కుమార్‌ను వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.ఓబుళపతి సోమవారం కలిశారు. వెలగపూడి సచివాలయంలో కలిసి విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడానికి, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలని విప్లవాత్మకమైన విద్యా సంస్కరణలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంఈఓ-2, పదోన్నతులు, బదిలీలు అయిన కొందరు ఉపాధ్యాయులకు జీతాలు అందలేదని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో పని చేసే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఓబుళపతి కోరారు.

అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా



ప్రతిభ చాటిన అనంతపురం జిల్లా క్రీడాకారులు

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల అథ్లెటిక్స్ పోటీలు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరులో సెప్టెంబర్ 21 నుంచి 23 వరకు నిర్వహించారు. ఇందులో పలువురు క్రీడాకారులు సత్తా చాటారు. బాయ్స్ అండర్-20 విభాగంలో రవీంద్ర (వెండి పతకం లాంగ్ జంప్, రజతం (400 మీటర్ల రిలే), అండర్-20 బాలికలు నవ్య శ్రీ (రజతం -డిస్కస్ త్రో) ద్రాక్షాయణి (రజతం-1500 మీటర్లు), మాలశ్రీ (రజతం-షాట్‌పుట్) పతకాలు సాధించారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ఆత్మకూరు: ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘ నాయకులు తహసీల్దార్ షర్మిలకు సోమవారం వినతి పత్రం అందించారు. సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. జిల్లా రైతు సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి వెంకటనారాయణ, మండల కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టండి



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

అనంతపురం టవర్‌క్లాక్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ కోరారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మాట్లాడుతూ మొక్కలు నాటడం, రక్తదానం, పలు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి చిరంజీవిరెడ్డి, నాయకులు లలిత్‌కుమార్, రామచంద్రయ్య, దేవిరెడ్డి లక్ష్మీదేవమ్మ, సోమయ్య, రాజేష్, అశోక్‌రెడ్డి, డాక్టర్ కోనంకి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యం

- రాప్తాడు మీదుగానే ఆర్టీసీ సర్వీసులు నడుపుతాం
- ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల



రాప్తాడు బైపాస్‌లో ప్రయాణికులు, వైఎస్సార్ సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాల్యవంతం మంజుల

రాప్తాడు: ప్రజలు, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమని, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ సర్వీసులు పెంచేలా కృషి చేస్తామని జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజలు, ప్రయాణికులు ఎవరూ ఇబ్బందులు పడకూడదన్నారు. రాప్తాడు మీదుగానే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుస్తాయన్నారు. సోమవారం 'సాక్షి'లో 'బస్సులు బైపాస్ అవుతున్నాయి' శీర్షికన వార్త ప్రచురితమైంది. కథనానికి స్పందించిన ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ రాప్తాడుకు చేరుకొని బైపాస్ సర్కిల్లో ఆర్టీసీ బస్సులు ఎలా తిరుగుతున్నాయో పరిశీలించారు. ఆమె అక్కడ ఉండగానే ఆర్టీసీ బస్సులు రాప్తాడు మీదుగా కాకుండా బైపాస్ మీదుగానే అనంతపురం, బెంగళూరుకు వెళ్లడం గమనించారు. అక్కడే ఉన్న ప్రయాణీలకులను బస్సులు ఏ రూట్‌లో వెళ్తున్నాయని ప్రశ్నించారు. వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ మాట్లాడుతూ ఆర్డినరి సర్వీసులు మాత్రమే రాప్తాడు మీదుగా వస్తున్నాయన్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు బైపాస్ మీదుగానే వెళ్తున్నాయని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో జరిగే సర్వసభ్య సమావేశాల్లో ఈ అంశంపై సభ్యులు లేవనెత్తినా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు.

ప్రతి గ్రామానికీ ఆర్టీసీ సర్వీసులు ..

ఆర్టీసీ చైర్ పర్సన్ మాల్యవంతం మంజుల మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక బస్సులు సక్రమంగా తిరిగేవి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రతి గ్రామానికీ రోడ్డు సౌకర్యం, ఆర్టీసీ బస్సులు వేయించినట్లు తెలిపారు. నియోజకవర్గ కేంద్రం రాప్తాడులోకి బస్సులు వెళ్లడంలేదన్న విషయాన్ని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆదోని, సీఎంఈ మోహన్ కుమార్, పెనుకొండ, హిందూపురం ఆర్టీసీ డిపో మేనేజర్లతో మాట్లాడినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందన్నారు. ప్రతి ఆర్టీసీ బస్సు రాప్తాడు మీదుగానే వెళ్తుందని తెలిపారు. ప్రజలు కోరిన మేరకే సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాకే చంద్ర, నారాయణ, సింగారప్ప, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ వైద్యులకు రూట్ కెనాల్‌పై శిక్షణ



రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్‌పై సీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: జిల్లాలోని వివిధ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో (సీహెచ్‌సీ) విధులు నిర్వర్తించే 11 మంది దంత వైద్యులకు రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్‌పై ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ నోటి ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా రూట్ కెనాల్ స్పెషలిస్టు వైద్యురాలు డాక్టర్ హరిప్రియ వైద్యులకు శిక్షణ ఇచ్చారు. భవిష్యత్తులో సీహెచ్‌సీల్లో రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, జిల్లా ఓరల్ హెల్త్ కో ఆర్డినేటర్ డాక్టర్ సతీష్‌కుమార్, దంత వైద్యులు ముత్యాలమ్మ, చిన్నపిల్లల వైద్యులు శ్రీవిద్య, డీఈఐసీ మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు. డీఎంహెచ్ఓ అసహనం: ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి పనితీరుపై డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి అసహనం వ్యక్తం చేశారు. సోమవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమయ్యే ముందు డాక్టర్ నారాయణస్వామి డీఎంహెచ్ఓకు ఫోన్ చేశారు. ముందస్తుగా డీఎంహెచ్‌కు సమాచారం ఇవ్వాలన్న విషయం కూడా తెలియదా అని డీఎంహెచ్ఓ అన్నారు.

'చంద్రబాబు కుట్రలను ప్రజలకు తెలియజేయాలి '

అనంతపురం కార్పొరేషన్: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాయలసీమ ద్రోహి అని, ఆయన కుట్రలను ప్రజలకు వివరించేలా కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని గుత్తి రోడ్డులో ఐటీ వింగ్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. రాయలసీమ అభివృద్ధికి చంద్రబాబు, టీడీపీ నాయకులు అడుగడుగునా అడ్డుపడ్డారన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా నాలుగు జిల్లాలు చెన్నైకు తాగునీటిపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2020లోనే చేపట్టిన పనులను జరగకుండా కోర్టుల ద్వారా టీడీపీ అడ్డుకుందన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా రాయలసీమకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు కాశీరావు, కోటేశ్వర రావు, రాంబాబు, జ్ఞానేశ్వర్, నవీన్, చంద్రశేఖర్, సుంకయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



జెడ్పీలోని తన చాంబర్‌లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను సన్మానిస్తున్న ఉద్యోగులు

అనంతపురం సిటీ: ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే రెండేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించగలిగామని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేసి సోమవారానికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జెడ్పీలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో ఉద్యోగులు సన్మానించారు. డిప్యూటీ సీఈఓ లలితాబాయి, జెడ్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మర్తాడు షేక్ రఫీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జెడ్పీ ఉద్యోగులనుద్దేశించి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశం వల్లే తాను ఈ స్థాయికి వచ్చానని, ఆయన ఆశయాలకనుగుణంగా అందరూ కలసికట్టుగా పని చేద్దామని పిలుపునిచ్చారు. నాల్గో తరగతి ఉద్యోగులు కూడా పూల మాలలు, శాలువలతో గిరిజమ్మను సత్కరించారు. గిరిజమ్మను జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు కూడా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, శిరివరం రంగారెడ్డి, సింహాద్రిపురం వేణుగోపాల్‌రెడ్డి, కర్త, రజనీష్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఉత్తమ షార్ట్ ఫిల్మ్‌గా ఆర్టీఐ

అనంతపురం కల్చరల్: అనంత కళాకారులు నిర్మించిన సందేశాత్మక చిత్రానికి మరోసారి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి దక్కింది. జిల్లాకు చెందిన దర్శక, రచయిత తరిమెల రాజు ఆధ్వర్యంలో తీసిన ఆర్టీఐ (ది పవర్ ఆఫ్ కామన్ మ్యాన్) లఘుచిత్రం ఉత్తమ షార్ట్‌ఫిల్మ్‌గా ఎంపికై ంది. ఈ మేరకు సోమవారం విజయవాడలో తెలుగు షార్ట్ ఫిల్మ్స్ అసోసియేషన్ వారు నిర్వహించిన వేడుకల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తమ చిత్రాలుగా ఎంపికై న వాటిని ప్రదర్శించారు. దీంతోపాటు సినీ దర్శకులు వీరశంకర్ చేతుల మీదుగా చిత్రయూనిట్‌కు అవార్డు అందించారు. ఈ సందర్భంగా దర్శకుడు తరిమెల రాజు, ప్రధాన పాత్రధారి కేపీ రాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా సామాన్యులకు ఎలా న్యాయం దక్కుతుందో చెప్పే సామాజిక సందేశంతో చిత్రాన్ని రూపొందించామన్నారు. దాదాపు 30కి పైగా లఘుచిత్రాలు పోటీకి వస్తే 'ఆర్టీఐ' లఘు చిత్రం అందరినీ ఆకట్టుకుని అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నిర్మాత జంగం శ్రీనివాసులు, సుధాకరరాజు, పుష్ప, సుధాకర్, పవన్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ఆత్మకూరు: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను సూపర్‌చెక్‌లో భాగంగా సోమవారం పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం 747 మంది రైతులకు సంబంధించి తనకు సూపర్‌చెక్‌లో ఈ క్రాప్ చేయించినట్లు తమ పరిశీలనకు వచ్చిందని తెలిపారు.

సచ్చిపోతే దిక్కెవరయ్యా!



భర్త విజయ్‌కుమార్‌ను స్ట్రెచర్‌పై అతికష్టమ్మీద తీసుకెళ్తున్న భార్య రమణమ్మ

అనంతపురం మెడికల్: సచ్చిపోయినా పట్టించుకోరా? అని కదిరికి చెందిన కదిరికి చెందిన విజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చెస్ట్ వార్డులో విజయ్‌కుమార్ అడ్మిట్ అయ్యాడు. వైద్యుడి సలహా మేరకు విధుల్లో ఉన్న మేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎంఎన్ఓ) అతన్ని ఎక్స్‌రే రూం నం. 25 వద్దకు తీసుకెళ్లి వదిలేసి వెళ్లిపోయాడు. రెండు గంటలైనా అటువైపు చూడలేదు. దీంతో విజయ్‌కుమార్‌కు ఆయాసం ఎక్కువై ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందిపడ్డాడు. భర్త ఇబ్బంది పడుతున్నాడని తెలుసుకున్న భార్య .. అతి కష్టమ్మీద స్ట్రెచర్‌ను తోసుకుంటూ వార్డుకు తీసుకెళ్లింది. రోగులను ఎక్కడబడితే అక్కడ వదిలేస్తున్నారు. ఎప్పటికప్పుడు వీరిని పర్యవేక్షించాల్సిన ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



డ్రామా పోటీలకు హాజరైన విద్యార్థులతో అధికారులు

రాప్తాడురూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతలో అవగాహన కల్పించడంలో భాగంగా సోమవారం అనంతపురం ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో విద్యార్థులకు డ్రామా పోటీలు నిర్వహించారు. జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళి మాట్లాడుతూ డ్రామా అనేది ప్రతిభావంతమైన మాధ్యమం అన్నారు. రెడ్ రిబ్బన్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ గిరిధర్ , జిల్లా ఎయిడ్స్ నియంత్రణ డీపీఎం వెంకటరత్నం మాట్లాడుతూ యువత, విద్యార్థులు సమాజంలో హెచ్ఐవీ పట్ల అవగాహన కల్పించడంలో ముఖ్యపాత్ర పోషించాలని కోరారు. అనంతరం డ్రామా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విష్ణుప్రియ, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రసూల్ పాల్గొన్నారు.

స్వచ్ఛత ఉద్యమంలో భాగస్వాములు కావాలి



మొక్కలు నాటి నీరు పోస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: స్వచ్ఛత ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మేయర్ వసీం నగర ప్రజలకు పిలుపునిచ్చారు.సోమవారం నగరంలోని 48, 49వ డివిజన్‌లో స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రజలు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు శ్రీనివాసులు, మునిశేఖర్, ఈఈ సూర్యనారాయణ రెడ్డి, డీఈలు దాక్షాయిణి, రాంప్రసాద్ రెడ్డి, ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల పాత్ర ప్రశంసనీయం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య

అనంతపురం: నిత్య జీవితంలో ఫార్మసిస్టుల పాత్ర ప్రశంసనీయమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య అన్నారు. సోమవారం ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పూలే భవనంలో నిర్వహించారు. ఫార్మసీ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ సి. వెంకటరమణ, ప్రిన్సిపాల్ సోమశేఖర్ మాట్లాడుతూ అవయవదానం ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో ఫార్మసిస్టుల పాత్రను కొనియాడారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న మాట్లాడుతూ వివిధ రంగాల్లో ఔషధాల నియంత్రణ, పరిశోధన, ఔషధ విశ్లేషణ తదితర రంగాల్లో వారి నైపుణ్యతను చాటుతున్నారన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం అర్బన్: ఉమ్మడి జిల్లాలో నీలకంఠాపురం శ్రీరామరెడ్డి నీటి సరఫరా పథకంలో అక్రమాలకు పాల్పడి బినామీ పేర్లతో బిల్లు చేసుకుంటున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడారు. మడకశిర డివిజన్‌లో రూ.6.50 కోట్లు అవినీతి జరిగిందన్నారు. బినామీ కార్మికుల పేరుతో సంబంధిత కాంట్రాక్టర్ బిల్లులు చేసుకున్నాడని ఆరోపించారు. ఈ అవినీతిపై ఉన్నతస్థాయి అధికారులతో విచారణ చేయించాలన్నారు. హిందూపురం డివిజన్‌లో కార్మికులకు అక్కడి కాంట్రాక్టర్ ఐదు నెలల వేతనం, 8 నెలల పీఎఫ్ చెల్లించలేదన్నారు. ఫేజ్-4 కళ్యాణదుర్గం, రాయదుర్గం డివిజన్లలో 2021 సంవత్సరం నుంచి సంబంధిత కాంట్రాక్టర్ కార్మికులకు పీఎఫ్ కట్టలేదన్నారు. కార్మికులకు అన్యాయం చేస్తున్న కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై ఇంటింటి సర్వే

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల నోడల్ అధికారి త్రిలోకనాథ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది మామిళ్లపల్లి, పర్వతదేవరపల్లి గ్రామాల్లో పర్యటించి ఇంటింటి సర్వే చేపట్టారు. కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకొని అనారోగ్యంతో ఉన్న వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, చిన్న పిల్లల వివరాలను నమోదు చేసుకున్నారు.ఎలకుంట్ల, మద్దెలచెరువు, దాదులూరు, కేఎన్ పాళ్యం సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో కూడా సర్వే చేస్తున్నట్లు నోడల్ అధికారి తెలిపారు.

తూనికలు, కొలతల అధికారుల తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

అనంతపురం క్రైం: నగరంలోని కమలానగర్‌లోని మొబైల్ యాక్సెస్ దుకాణాలపై తూనికలు కొలతల శాఖ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్యాకేజీలపై తయారీదారుని పూర్తి చిరునామా, తయారైన నెల, సంవత్సరం, ఎమ్మార్పీ (ఆల్ ట్యాక్స్) వినియోగదారుడు ఫిర్యాదు చేసేందుకు ఉండాల్సిన పేరు, చిరునామా, ఫోన్ నంబరు, ఈ మెయిల్ ఐడీ తదితర చట్టపరమైన వివరాలు ముద్రించకపోవడంతో మొత్తం 5 కేసులు నమోదు చేశారు. రూ. 1,05,000 జరిమానా విధించారు. ఈ తనిఖీలలో ఇన్‌స్పెక్టర్, లీగల్ మెట్రాల జీఎం మహమ్మద్ గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం రూరల్: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శిల్పారామంలో మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల నిరసన

అనంతపురం అర్బన్: కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, నగర కార్యదర్శి వెంకటనారాయణ, తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

ఓపీఎస్ అమలు చేయాలి

అనంతపురం అర్బన్: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని ఫాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఫాప్టో చైర్మన్ సిరాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి మాట్లాడారు. అనంతరం స్పందనలో కలెక్టర్ గౌతమికి నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, నాయకులు గోవిందరాజులు, నాగేంద్ర, లింగమయ్య, ఏపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ఆత్మకూరు: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను సూపర్‌చెక్‌లో భాగంగా సోమవారం పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం 747 మంది రైతులకు సంబంధించి తనకు సూపర్‌చెక్‌లో ఈ క్రాప్ చేయించినట్లు తమ పరిశీలనకు వచ్చిందని తెలిపారు. ఈ నెల 30లోపు రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు.

గానగాంధర్వుడికి గాయకుల నివాళి

అనంతపురం కల్చరల్: స్థానిక మూడో రోడ్డులోని ఘంటసాల ఆరాధన సమితి ఆధ్వర్యంలో సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, రామయ్య, పద్మ, ఉమ, లక్ష్మీనారాయణ తదితరులు ఆ పాత మధురాలతో ఎస్పీబీకి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఎస్పీ బాలసుబ్రమణ్యానికి నివాళులర్పించారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. సంస్థ అధ్యక్షుడు సురేష్ నేతృత్వంలో శ్రీరాములు, ఆదినారాయణ, శ్రీనివాసులు, కేశవ, నరసింహులు మాట్లాడారు.

అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సు రద్దు చేయకూడదని వినతి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలలో అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సు రద్దు చేయకూడదని ఏఐఎస్ఏ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్యకు సోమవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, కార్యదర్శి రాజు నాయక్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రజనీ, హరీష్, సురేష్ పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు ...అండగా ఉంటాం

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లికి చెందిన ప్రభుత్వ చౌకధాన్యపు డీపో డీలర్ పంగ చిన్న బాబయ్య ఈ నెల 23న 44వ జాతీయ రహదారి బొమ్మేపర్తి వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఆయన అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి గాయపడిన బాబయ్యను పరామర్శించారు. అధైర్య పడొద్దు... అండగా ఉంటామని భరోసా ఇచ్చాడు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలకు కసరత్తు

అనంతపురం మెడికల్: గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి అనంతపురం జిల్లా శాఖ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల అధికారులు డాక్టర్ పద్మావతి (గుంటూరు నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్), ఆర్.జ్యోతి (కర్నూలు నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్), సభ్యత్వ నమోదుకు సంబంధించి జిల్లాలో ఇద్దరు సభ్యులు కోకిల చాముండేశ్వరి, పీ లక్ష్మిని నియమించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి, వైద్య కళాశాల, డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్ పరిధిలో ఉన్న స్టాఫ్‌నర్సులతో సభ్యత్వ నమోదు చేయించాలని ఉత్తర్వుల్లో వారు పేర్కొన్నారు.

రేపు అధికారుల పర్యటన

కనగానపల్లి: నరసంపల్లిలో బుధవారం మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటిస్తారని ఈఓఆర్డీ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులతో చర్చిస్తారన్నారు.

28న అనంత పద్మనాభ వ్రతం

అనంతపురం కల్చరల్: స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమంలో అనంత పద్మనాభుని వ్రతం ఈనెల 28న ఘనంగా జరుగుతుందని సమర్థ అక్కల్‌కోట మహారాజ్ సేవా సమితి కమిటీ సభ్యులు విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఉదయం కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారికి గాజుల అలంకరణ సేవ, అనంతరం శాస్త్రోక్తంగా అనంత పద్మనాభ వ్రతం జరుగుతాయన్నారు.

30న తలనీలాల బహిరంగ వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో ఈనెల 30న తలనీలాలు పోగుచేసుకును హక్కుల కోసం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం సోమవారం పేర్కొన్నారు. మాఘమాసం మినహా విడిదినాల్లో మాత్రమే తలనీలాలను పోగు చేసుకోవచ్చన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.